పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పౌష్టికాహారం తీసుకోవడంతోనే తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం పౌష్టికాహారం మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకుగాను ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా పౌష్టికాహార సరుకులను పంపిణీ చేస్తుందన్నారు. వీటిని ప్రతి ఒక్క గర్భిణి, బలింతరాలు తప్పని సరిగా తీసుకొని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, లలిత, సిడిపిఓ నీలిమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

శరవేగంగా రహదారుల పునరుద్ధరణ పనులు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రహదారుల పునరుద్ధరణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి రహదారులు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఎపిఇపిడిసియల్ అధికారులు ఎం.పి.డి. ఓ లు, తహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న రహదారులు, తాగునీటి వనరులు, విద్యుత్తు సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సర్పంచులు, సచివాలయం సిబ్బందితో సమన్వయం చేసుకుని క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నిధుల గురించి ఆలోచించకుండా పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సీలేరు – జి.కె. వీధి ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేసారు. శానిటేషన్ పనులు, అప్రోచ్ రోడ్డు పనులు, గ్రామాలలో అంతర్గత రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు, చింతూరు, వి.ఆర్. పురం, కూనవరం మండలాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ధారకొండ పంచాయతీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. సర్పంచులతో మాట్లాడి తాగునీటి, విద్యుత్తు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో రంపచోడవరం ఐటిడిఏ పిఓ కె.సింహాచలం, రహదారులు భవనాల శాఖ బాల సుందరబాబు, జిల్లా పంచాయితీ అధికారి కొండలరావు, తహశీల్దారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే..

తుపానుకు కూలిన వంతెనలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు :మండలం జామి గూడా ప్రాంతం రుడకోట నుండి జాంగుడ వరకు వేసిన రోడ్డు మార్గమధ్యలో వంతెనల నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో ఇటీవల తుఫానుకు దెబ్బతిన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర తెలిపారు. బుధవారం ఆ ప్రాంతంలో సిపిఎం బృందం దెబ్బతిన్న బ్రిడ్జిలను సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైన రూడకోట నుండి కుముడా మీదుగా జామ్ గూడా ఒరిస్సా బోర్డర్ వరకు వేసిన తారు రోడ్డు, మార్గమధ్యలో నిర్మాణం చేపట్టిన బ్రిడ్జిల నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో సంవత్సరం కాకముందే తుఫాన్‌కు దెబ్బతిన్నాయన్నారు. గిరిజన ప్రాంతంలో కోట్లాది రూపాయలు గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పర్సంటేజ్‌లకు కక్కుర్తి పడటంతో కాంట్రాక్టర్లు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించ లేదన్నారు. దీంతో, సంవత్సర కాలం అవ్వకుండానే కూలి పోతున్నాయన్నారు. బ్రిడ్జిలు కూలి పోవడంతో వాహనాలు నిలిచి, జనజీవనం స్తంభించి పోతుందన్నారు. నిత్యావసర వస్తువులు డిఆర్ డిపో నుండి తెచ్చుకోవడానికి కూడా అవకాశం లేని పరిస్థితి నెల కొందన్నారు. రోడు, బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి పై, పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్.ధర్మన్న పడాల్, జై.సునీల్ కుమార్ పప్పుల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేంద్ర

పనులు చేయిస్తున్న సర్పంచ్

రచ్చబండ మరమ్మతు పనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని అరుకు గ్రామంలోని రచ్చబండ మరమ్మతు పనులను సర్పంచ్ జి శారద ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకు గ్రామంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు చర్చించుకోవడానికి రచ్చబండ వేదికగా ఉందన్నారు. కొన్ని నెలల నుంచి మరమ్మత్తుకు గురై శిథిలావస్థలో ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ నిధులతో మరమత్తు పనులు చేపడుతున్నామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల:వినాయక చవితి సందర్భంగా ఉరుము గ్రామంలో ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు స్థానిక సర్పంచ్ రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పోటీలలో 13 జట్లు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి . బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, రాంజీ పోతురాజు, జయరాజు, సాయి పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

తాగునీటి సౌకర్యం కల్పించాలి

గెడ్డ నీటిని పరిశీలిస్తున్న చిన్నయ్యపడాల్, ధనుంజయ

ప్రజాశక్తి.చింతపల్లి:జికె.వీధి మండలం చట్రాపల్లి గ్రామస్తులను సప్పర్ల కేంద్రానికి తరలించి ప్రభుత్వం అండగా నిలవాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయలు డిమాండ్ చేశారు. ఇటీవలి పెద్దబారడ పంచాయతీ, చింతలూరు గ్రామంలో కలుషిత నీరు, తాగి మృత్యువాత పడ్డ చింతలూరు గ్రామాన్ని సందర్శించారు. తాగుతున్న ఊట నీరుని పరిశీలించారు. రెండు బోర్లు ఉన్నప్పటికీ నీరు చాలక మూడు గొయ్యిల ద్వారా వస్తున్న ఊటనీరు వాడుతున్నారని, మరోపక్క జల్ జీవన్ మిషన్ ద్వారా ట్యాంకు నిర్మించినప్పటికీ సక్రమంగా నీరు అందక పోవడంతో వృధాగా ఉందన్నారు. గిరిజన మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి, ఒక్కరికి రూ.25 లక్షలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రపల్లిలో మృతి చెందిన కుమారికి మరో 20 లక్షలు ఇవ్వాలని, దారకొండ పి హెచ్‌లో చికిత్స పొందుతున్న క్షత గాత్రులకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేకలు, కోళ్ల ,ఆవులకు నష్ట పరిహారం అంచనా వేయాలన్నారు. ఇప్పటికీ చట్రపల్లిలో పేరుకుపోయిన బురద కిందనే కోళ్ళ,ఆవులు, మేకలు, ఉన్నాయని, ఆస్తి నష్టం బాగా వాటిల్లిందన్నారు. గాలికొండ, జంపలోవ, ఇదే కొండను అనుకొని ఈ గ్రామాల్లో కూడా కొండ చరియలు విరిగిపడటం జరిగిందని, ప్రాణనష్టం లేక పోయినప్పటికీ, భయాందోళనలతో గిరిజనులు ఉన్నారన్నారు. గ్రామాల్లో పర్యటించిన గిరిజనులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గెమ్మెలి గిరిబాబు, గెమ్మెలి రమణమ్మ, పాంగి సమీరా తదితరులు ఉన్నారు.

డుంబ్రిగుడలో అన్న సమారాధన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో మండపంలో బుధవారం జీసిసి మేనేజర్ దామోదర్ ఆర్థిక సౌజన్యంతో అన్నసమారాధన చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు భోజనాలను వడ్డిస్తూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ నాయకులు, సూర్య ప్రకాష్, నవ సూర్య, అవినాష్, సురేంద్ర, అభి, తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గినా..

భయం గుప్పెట్లోనే విలీన గ్రామాలు

- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- ఇంకా జల దిగ్బంధంలోనే అనేక ప్రాంతాలు
- కొనసాగని రాకపోకలు
- పునరావాస కేంద్రాల్లో పలువురు బాధితులు

తాడు సాయంతో కాజ్‌వే దాటిస్తున్న సిపిఎం సర్పంచ్ సరోజిని, ఇతర నేతలు

ప్రజాశక్తి -ఎటపాక : రెండు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి బుధవారం ఉదయం నుండి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయం 6 గంటల వరకు పెరుగుతూ 50.3 అడుగులకు చేరుకుంది. 10గంటల వరకు నిలకడగా కొనసాగిన వరద ఉధృతి, ఆ తర్వాత క్రమేపి తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6గంటలకు 48.4అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గోదావరి కాస్త శాంతించడంతో ముంపు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా భద్రాచలం వద్ద నీటిమట్టం క్రమేపి తగ్గుతున్నప్పటికీ గ్రామాల్లో వరద ముంపు నుండి బయట పడలేదు. గ్రామాలు ముంపు నుండి పూర్తిగా బయట పడటానికి, రాకపోకలు పూర్తి స్థాయిలో జరగడానికి మరో రోజు పట్టే అవకాశం ఉంది. భద్రాచలం-కుంట జాతీయ రహదారిపై పలు చోట్ల వరద నీరు చేరడంతో అంతరరాష్ట్ర రవాణా నిలిచిపోయింది. మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాయనపేట నుండి మురుమూరు వరకు గ్రామాల వరకు పలు చోట్ల వరద నీరు రోడ్ల పైకి రావడంతో రవాణా పూర్తిగా నిలిచిపోయింది.

వరద నీటి ముంపులోనే ఉన్న ధర్మతాలగూడెం

చింతూరు.: శబరి గోదావరి నదుల ప్రవాహం బుధవారం మధ్యాహ్నం నుండి క్రమేపి తగ్గుతూ ప్రమాద స్థాయి దిగువకు ప్రవహిస్తోంది. మండల కేంద్రంలోని శబరి బ్రిడ్జి, సంతపాకలు రహదారి వరద నుండి బయటపడ్డాయి. శబరి నది నీటిమట్టం 44 అడుగులకు తగ్గి ప్రవహిస్తోంది. గత రాత్రి 45 అడుగుల ప్రమాద స్థాయిలో ఉన్న శబరి పోటు వల్ల రహదారులన్నీ మూసుకుపోయాయి. డొంకరరాయి డ్యాం గేటులన్నీ మూసివేసేశారు. బలిమెల డ్యాము నుండి 20వేల క్యూసెక్కుల నీటి దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అయినా ప్రమాదం ఏమీ ఉండదని అధికారులు వెల్లడించారు. బుధవారం వారాంతపు సంత మండల కేంద్రంలో రోడ్లపై ఏర్పాటు చేసినారు. ఎన్టీఆర్ ట్రస్ట్ బృందం మండల కేంద్రానికి చేరుకొని సహాయ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్ప శ్రీ. చింతూరు ఐటిడిఏ పిఓ అపూర్వ భారత్ ఎప్పటికప్పుడు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

విఆర్ పురం : గోదావరి, శబరి నదులకు వరద పోటెత్తడంతో ముంపు గ్రామాల బాధితులు రేఖపల్లి తహశీల్దార్, కార్యాలయం, సచివాలయ మైదాన ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని ఉన్నారు. వడ్డిగూడెం గ్రామస్తులు సర్వం ఇంటిలోనే వదిలేసి, పిల్లాపాపలతో పడవలపై రేఖపల్లిలోని మైదాన ప్రాంతానికి చేరుకున్నారు. శ్రీరామగిరి గ్రామంలోని ఇళ్లు పూర్తిగా నీటమునిగిపోవడంతో వారు పక్కనే ఉన్న గుట్ట పైకి సామగ్రితో చేరుకుని, గుడారాలు వేసుకొని నివాసముంటున్నారు. మూడు రోజుల క్రితం మంచి నూనె కందిపప్పు బంగాళదుంప ఉల్లిపాయలు ఇచ్చి వెళ్లిన అధికారులు తర్వాత కనిపించడం లేదని బాధితులువాపోతున్నారు. తక్షణమే నాటు పడవలు ఏర్పాటు చేసి నిత్యవసర సరుకులు ఇవ్వాలని కోరారు. తమను కాంటూర్ పరిధిలో చేర్చి పునరావాసం, ప్యాకేజీని ఇచ్చి ఈ బాధల నుంచి విముక్తి కల్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

సహాయక చర్యల్లో సిపిఎం బృందం

విఆర్ పురం: ఇటీవల వచ్చిన మండలంలోని రేఖపల్లి పంచాయతీ అన్నవరం ఉమ్మడివరం మధ్య లోలెవెల్ బ్రిడ్జి ఒకవైపు కోతకు గురికావడంతో 40 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. తాజా వరదలతో ఈ కాజ్‌వే పైనుంచి రాకపోకలకు వీలులేని పరిస్థితుల్లో రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం నేతల బృందం అక్కడి పరిస్థితులను పరిశీలించి, అప్రమత్తమయ్యారు. బ్రిడ్జిపైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో తాడు సాయంతో ప్రజలను దాటించే సహాయక చర్యలు చేపట్టారు. వాహనదారులు అటుగా రావద్దని సర్పంచ్ సరోజినితోపాటు సిపిఎం నేతలు హెచ్చరిస్తున్నారు. వరదల వల్ల అత్యవసర సమయాల్లో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించి నాటు పడవలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్య నారాయణ నాయకులు తాతబాబు రెడ్డి సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో పారిశుధ్య పనులు

విఆర్ పురం: వరదలతో ముంపు బాధితులంతా రేఖపల్లి గ్రామంలోని పునరవాస కేంద్రానికి చేరడంతో, అక్కడ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ సరోజిని, సెక్రటరీ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం పారిశుధ్య పనులను చేపట్టారు. సర్పంచ్ పూనం సరోజిని మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి, తహశీల్దార్ కార్యాలయం, సచివాలయం, కస్తూర్బా పాఠశాల, మినీ గురుకులం, పరిసరాల్లోని మైదాన ప్రాంతానికి వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, ధర్మతాల గూడెం గ్రామాల ప్రజలు పునరవాస కేంద్రానికి వచ్చారన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, ఇతర పారిశుధ్య పనులు చేపట్టారు. బాధితులతో మాట్లాడి, వారికి ఏ అవసరమున్నా తామున్నామని భరోసానిచ్చారు. సిపిఎం జిల్లా నేత పూనం. సత్యనారాయణ పాల్గొన్నారు.

రేఖపల్లిలో బ్లీచింగ్ చల్లించే పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, సిపిఎం నేతలు

పునరావాసం, ప్యాకేజీ కోసం ఆందోళన

గోదారి నీటిలో నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీరామగిరి వాసులు

విఆర్ పురం: మండలంలోని శ్రీరామగిరి గ్రామ పంచాయితీ పరిధిలోని శ్రీరామగిరి, చొక్కనపల్లి, కొత్తూరు, కల్తునూరు తదితర గ్రామాలను పోలవరం ప్రాజెక్టులో మొదటి కాంటూర్‌లో ముంపునకు గురయ్యే నిర్వాసితులకు ఇచ్చేలా ఆర్ఆర్ ప్యాకేజీ, భూమికి భూమి భూ నష్టపరిహారం,18ఏళ్లు నిండిన వారందరికీ ప్యాకేజీ తక్షణమే ఇచ్చి, పునరావాసం కల్పించి.ఈ వరదల నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతూ గోదావరి నీటిలో దిగి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పులి.సంతోష్ కుమార్, నాళ్లరపు.అశోక్, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచ్చిచ్చు సత్యనారాయణ, నాల్లారపు లక్ష్మణరావు, తుమ్మలపల్లి.రాము, నెర్రిబోయిన.రాజు, నాళ్ళరపు. సత్తిబాబు, గణేష్, దారోగి బాబూరావు, సాయిబాబు, వాదం రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

కూనవరం :గోదావరి వరదలతో తమ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని ప్రజా ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. తహశీల్దార్ కె.నాగబాబు, ఎంపిడిఓ లక్ష్మీరెడ్డికి వినతి పత్రం అందజేశారు.. గోదావరి నదికి 45 అడుగులు వరద వస్తే తమకు విద్యుత్ సౌకర్యం ఉండటం లేదపెద్దర్యాక్ పంచాయితీ నుండి రేగులపాడు పంచాయతీ వరకు అలాగే గొమ్ము అయ్యవారి గూడెం సుమారు 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామన్నారు.

దీనిపై కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు గతంలో విన్నవించినా స్పందన లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ఎత్తయిన ప్రదేశాల మీదుగా విద్యుత్ లైన్ వేసి విద్యుత్ కష్టాలను పరిష్కరించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ నాగబాబు స్పందించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు అమ్మాజి, జయసుధ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, పాయం సత్యనారాయణ,బాబురావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

శరవేగంగా ప్రధాన రహదారి క్లియరెన్స్ పనులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు నుంచి చల్లని శిల్ప వరకు ప్రధాన రహదారి క్లియరెన్స్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సోమవారం నుంచి పనులు ప్రారంభించగా, బుధవారం సాయంత్రానికి సీలేరు నుంచి జొన్నమామిడి వరకు ప్రధాన రహదారిపై ఐదుచోట్ల కొండ చరియలు, విరిగిపోయిన మట్టి దిబ్బలు చెట్లు మోడ్లు తొలగించారు. రోడ్డుపై నాలుగు అడుగులు మేర మట్టి పేరుకుపోవడంతో పనులు ముందుకు సాగడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. మట్టిలో నీటి శాతం ఎక్కువగా ఉండడంతో రహదారి క్లియరెన్స్ పనులలో జాప్యం జరుగుతుంది. యుద్ధ ప్రాతిపదిగిన పనులు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులు గుత్తేదారుడు పిలోన్‌కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు దగ్గరుండి క్లియరెన్స్ పనులు వేగవంతం చేసే విధంగా పని ప్రదేశంలో మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. సీలేరు నుంచి సప్పర్ల వరకు రహదారి క్లియరెన్స్ పనులు వేగవంతం చేసి రెండు రోజుల్లో రాకపోకలు వినియోగంలో తెచ్చేలా చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులుకు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడి పిఓ అభిషేక్ ఆదేశించారు. అయితే. సీలేరు నుంచి చల్లని శిల్ప వరకు క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలంటే మరొక మూడు రోజులు సమయం పడుతుంది. అయితే చల్లని శిల్ప నుంచి ధారకొండ మధ్య ప్రధాన రహదారిపై ఎటువంటి కొండ చరియలు పడకపోవడంతో రవాణా సౌకర్యం ఎటువంటి అంతరాయం లేదు.కాగా రహదారి క్లియరెన్స్ పనులను ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ పరిశీలించారు. తగు సూచనలు చేశారు.

రోడ్డు క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న పిఒ అభిషేక్

చెక్కులను అందజేస్తున్న కలెక్టర్, గిడ్డి ఈశ్వరి

కలుషిత ఆహార బాధితులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పరిహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. కోటవురట్ల మిషనరీ హాస్టల్లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన చిన్నారులలో ముగ్గురుకి కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ తూములోవ గ్రామానికి చెందిన విద్యార్థులు కొర్రా సురేష్, కొర్రా గణేష్ విద్యార్థుల తండ్రికి రూ.1 లక్ష, పాంగి నంది తల్లి సాలిమి రూ.50 వేలు చెక్కును బుధవారం ఆయన కార్యాలయంలో అందజేసారు. గతంలో 40 మంది చిన్నారులకు పరిహారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారుల తలిదండ్రులతో మాట్లాడారు. బాధితులు ఆధార్, రేషన్ కార్డులు లేవని చెప్పడంతో రెండు రోజులో తూములోవ గ్రామంలో మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి అందరికి ఆధార్ కార్డులు రెండు నెలలో అందిస్తామని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ముఠా, సంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నర్సీపట్నంలో ఎన్టిఆర్ స్టేడియంలో కార్మిక సంఘం సమావేశం ప్రెసిడెంట్ రుత్తల గోవింద అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, అసంఘటిత, ముఠా కార్మికులు సుమారు 300మంది నర్సీపట్నంలో ఎన్నో ఏళ్ళుగా హమాలీ పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. కార్మికులు చేస్తున్న పనులతో ప్రభుత్వాన్నికి కోట్ల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. కాని, కార్మికులకు మాత్రం జీవిత భరోసా లేదని, ప్రమాద బీమా, పెన్షన్, ఇళ్ళు మంజూరు, పిల్లలు చదువుకు ప్రత్యేక ఋణ సదుపాయం వంటి సదుపాయాలు ఏమీ లేవని తెలిపారు. అంఘటిత కార్మికులను సమగ్ర చట్టం చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన కార్మికులకు అందించే సహాయం తప్ప ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నుల భారం పెంచుతుంటే కార్మికులు ఏ విధంగా బతుకుతారని ప్రశ్నించారు. సమస్యలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం ప్రదాన కార్యదర్శి అడిగర్ల రాజు, నానాజీ, అప్పారావు, రాము, సత్తిబాబు, సాంబ, నాగేశ్వరరావు,కొండ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పడాలంటే సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మండలంలో ఎండపల్లి, జల్లూరు, అన్నవరం, లింగాపురం, బికేపల్లి గ్రామాలలో సందర్శించారు. ఆయా గ్రామాల్లో కేంద్రాలను పరిశీలించిన ఆమె మండల వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తయిన వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్టోబర్ రెండు నాటికి వినియోగంలోనికి తీసుకురావాలని కార్యదర్శులకు సూచించారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పట్ల ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే కంపోస్టు ఎరువులు తయారవుతున్న వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శిలు నరసింహ, సంతోషి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మరమ్మతు చేపట్టాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి మండలం కరకవలస రైల్వే స్టేషన్ పరిధిలో ఆర్ఎస్ఆర్, తుంబాత్ కంపెనీ రైల్వే డబుల్ లైన్ బ్రిడ్జి నిర్మాణంతో గన్నెల జంక్షన్ నుండి కరకవలస రైల్వే స్టేషన్ వరకు బీటి రోడ్ పూర్తిగా ధ్వంసం అయ్యిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. బుధవారం కరకవలస డబుల్ లైన్ ట్రాక్ నిర్మాణంతో ధ్వంసమైన రోడ్డును బొండం పంచాయితీ ఆదివాసీ గిరిజన సంఘం బృందం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, విశాఖపట్నం నుండి కిరండోల్ రైల్వే డబుల్ లైన్ నిర్మాణంలో భాగంగా బొండం, కరకవలస బ్రిడ్జి, ఆర్ ఎస్ ఆర్, తుంబాత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ అనే కంపెనీ టెండర్ ద్వారా నిర్మాణం చేపడుతుందన్నారు. కరకవలస బ్రిడ్జి నిర్మాణం కోసం అతిభారీ వాహనాలు, భారీ పని పరికరాలు, కంటైనర్లు, రోడ్డు మార్గంలో తీసుకురావడంతో గన్నెల జంక్షన్ నుండి కరకవలస రైల్వే స్టేషన్ వరకు బీటి రోడ్డు ధ్వంసం అయి కంకర రాళ్ళు తేలి గుంతలు ఏర్పడిందన్నారు. కరకవలస బ్రిడ్జి నిర్మాణంతో కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై గెడ్డ ప్రవహించడంతో మట్టి పేరుకు పోయిందని, దీంతో బొండం పంచాయతీ రేగా, రంగినిగుడ, కరకవలస, జయంతివలస, కొలియగూడ, కొత్తవలస, అనంతగిరి మండలం కోనాపురం పంచాయతీ 10 గ్రామాల వేలాది మంది ఆదివాసులు

ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

రాకపోకలకు తీవ్ర అవస్థల గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం, సంబంధిత రైల్వే అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్డును ఆర్ఎస్ఆర్ తుంబాత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ గుత్తేదారులతో మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. కరకవలస రైల్వే బ్రిడ్జి వద్ద కొండపై నుంచి రోడ్డు మీద మట్టి పేరుకు పోకుండా రక్షణ ప్రహరీ గోడ నిర్మించాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత గ్రామాల ఆదివాసులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జి బాబు, డొంబు, సిబో రాజు, టీడీపీ నాయకులు కిల్లో దయానిధి, పి.రాజు, గ్రామస్థులు పి సోహన్, కృష్ణా, అప్పారావు, బుజ్జీ, రవి, సుంద్ర, పండు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చొంపి వంతెన

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

శిథిలావస్థలో ఉన్న వంతెన

ప్రజాశక్తి- అరకులోయరూరల్: అరకులోయ మండలం చొంపి వంతెన ప్రమాదకరంగా మారింది. ఏ సమయంలో ఏమీ జరుగుతుందోనన్న భయాందోళనతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన మార్గం నుంచి అరకులోయ మండలం చొంపి, శిరాగం, బస్కి, మాడగడ, హుకుంపేట మండలం బూర్జ,వేంగడ, అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ గ్రామాల గిరిజనులు తరుచుగా అరకులోయ మండల కేంద్రంలో వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ పంచాయితీ పరిధి గ్రామాలకు వెళ్లాలంటే వేరే మార్గం లేక తప్పని పరిస్థితుల్లో వెలవసిన పరిస్థితి వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ప్రమాధకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉన్న ప్రహరీ రక్షణ వలయాలు కూడా విరిగి కూలి పోయాయి. దీంతో, అతి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై నుంచి టిప్పర్, లారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలకు వంతెనపై బురుదమాయంగా మారింది. నూతన వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే వంతెన నిర్మించాలని గిరిజనులు కోరారు.

వర్గీకరణపై దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: షెడ్యూల్డ్ కులాలను వారికి మరింత ప్రాధాన్యతనిచ్చే లక్ష్యంతో ఉప వర్గీకరించే హక్కు రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా బహుజన సంస్థలు పిలుపునిచ్చిన నేపథ్యంలో స్థానిక అబీద్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబీద్ సెంటర్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా అంబేద్కర్ మిషన్ కోఆర్డినేటర్ సాల్మన్ రాజు మాట్లాడుతూ, ఆర్టికల్ 341 ప్రకారం భారత రాష్ట్రపతి ద్వారా ఎస్సీ ఎస్టీ జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులు పార్లమెంటు ద్వారా మాత్రమే చేయబడుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణతో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆర్డిఓకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు. ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గణపతి మండపాల్లో వరుస దొంగతనాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వినాయక చవితిని పురస్కరించుకొని ప్రతి వీధిలో గణపతి విగ్రహాలను ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సందట్లోసడేమియా అనే విధంగా చెడు అలవాట్లుకు బానిసలైన కొంత మంది యువకులు రాత్రిపూట గణపతి మండపాలపై పడి దొరికిన కాడికి దోచుకుంటూ ఆ పూటకు ఎంజాయ్ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కొంత మంది గంజాయి బ్యాచ్ ఆరిలోవ టిఐసి పాయింట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు గల పలు వీధుల్లో వరుసగా ఐదు మండపాల్లో ఉన్న దేవుని హుండీలు, అక్కడ నిద్రిస్తున్న యువకుల జేబుల్లో నుంచి సెల్ఫోన్లు ఎత్తుకు పోయారు. విశాలాక్షినగర్ రామాలయం వీధిలో మండపం వద్ద సౌండ్ బాక్స్ను ఎత్తుకు పోయారు. దీనిపై నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ క్రైం విభాగం పోలీసులు బుధవారం సిసి కెమెరాల ఆధారంగా పరిశీలించారు. అనుమానితులైన కొంత మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు.

గిడిజాల జగనన్న లే-అవుట్లో ట్రాన్స్ఫార్మర్, ఇసుక చోరీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల జగనన్న లే-అవుట్-2లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, ఇసుక చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించారు. లే-అవుట్లో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను తొలగించి అందులో ఉన్న కాపర్ వైర్లను తస్కరించుకుపోయినట్లు గుర్తించారు. సుమారు 100 టన్నులు ఇసుక కూడా మాయమైనట్లు కాంట్రాక్టర్ తెలిపారు. 30 లారీలకు పైగా ఇసుకను అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. నైట్ వాచ్మ్యాన్ను కాంట్రాక్టర్ సంప్రదించగా ఊరులో గొడవలు అయితే అర్ధరాత్రి వేళ వెళ్లాల్సి వచ్చిందని, ఆ సమయంలో తీసుకుపోయి ఉంటారని తెలిపారు. బుధవారం విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యుత్ శాఖ ఎఇ సురేష్కుమార్ సిబ్బందితో లే-అవుట్కు చేరుకొని చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పరిశీలించారు.

వ్యాన్ ఢీకొని చిన్నారి దుర్మరణం

ప్రజాశక్తి- వడ్డాది : వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి. బుచ్చయ్యపేట మండలం కోమల్లపూడి గ్రామంలో నివాసముంటున్న మహాలక్ష్మినాయుడు వత్తి రీత్యా తాపీ మేస్త్రి. ఆయనకు గొన్న షర్మిల అనే ఆరేళ్ల పాప వుంది. బుధవారం స్కూల్ నుండి ఇంటికి వచ్చి తన తండ్రితో ఆడుకున్న షర్మిల, అనంతరం ట్యూషన్కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలు దేరగా, రోడ్డుపై వ్యాన్ ఢీకొట్టడంలో అక్కడికక్కడే మృత్యువాత పడింది. వ్యాన్ డ్రైవర్ పరారయ్యాడు. పాప దుర్మరణంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు

నదిలో మహిళ గల్లంతు

ప్రజాశక్తి -వడ్డాది : బహిర్భూమికి వెళ్లిపెద్దేరు నదిలో కాలుజారి గల్లంతైన సంఘటన బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో చోటుచేసుకుంది స్థానిక ఎస్ఐ డి ఈశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు.కొప్పాక గ్రామానికి చెందిన జనపరెడ్డి సుబ్బలక్ష్మి, తన అక్క, బద్ది విజయలక్ష్మి ఇరువురు వడ్డాది బ్రిడ్జి దగ్గర ఉన్న పెద్దేరు నది గట్టుకు మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లింది. బహిర్భూమి ముగించుకొని తిరిగి ఇద్దరు వస్తుండగా వారిద్దరిలో జనపరెడ్డి సుబ్బలక్ష్మి గట్టుమీద నుండి కాలుజారి నదిలో పడిపోయిందని బద్ది విజయలక్ష్మి తెలియపరచగా, దీనిపై బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

2 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: 2 కేజీల లిక్విడ్ గంజాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు కృష్ణదేవిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర తెలిపారు. బుధవారం అల్లూరి పార్కు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా ఏటిగైరంపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి గోవింద వద్ద ఈ గంజాయిని గుర్తించామన్నారు. ఈ లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకొని గోవింద్ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు.

రేపాకలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరం

చిన్నారులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-కూనవరం : పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేపాక ఆశ్రమ పాఠశాలలో కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని సర్పంచ్ నాగమణి ప్రారంభించారు. చిన్నపిల్లల ఆరోగ్యానికి మేలు చేసే ఈ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నాగమణి ప్రజలను కోరారు. కార్యక్రమంలో కూటూరు ప్రాథమిక వైద్య కేంద్ర ఎఎన్ఎంలు హెల్త్ వర్కర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

నీటి మడుగులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎటపాక : ప్రమాదవశాత్తు నీటి మడుగు లో పడి వ్యక్తి మృతి చెందాడు. కృష్ణవరం గ్రామ పంచాయితీ గొందిరాజుపేటకు చెందిన కౌలూరి సూరిబాబు(41) బుధవారం మధ్యాహ్నం తన పశువులు కాస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటి మడుగులో పడి చనిపోయాడు. తోటి పశువుల కాపరులు, గ్రామస్తులు గమనించి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భద్రాచలం ఏరియా హాస్పిటల్కు తరలించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని స్థానిక రేంజ్ అధికారి ఎం.అబ్బాయి దొర అన్నారు. బుధవారం అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని స్థానిక రేంజ్ అధికారి ఎం అబ్బాయిదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అధికారి ఎస్ శ్రీనివాస్ చిత్రపటానికి ఫారెస్ట్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అటవీ అమరవీరు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ రాము,బాలాజీ,ఫారెస్ట్ పాల్గొన్నారు.

శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్గా ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ గౌరీ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన పాలకవర్గం ఎన్నికలు బుధవారం జరిగాయి. సొసైటీ చైర్మన్గా చదరం డివివి ప్రసాద్, వైస్ చైర్మన్గా ఆడారి నూకరాజు, ట్రెజరర్ కం ఎండిగా ఆడారి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాద్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెంటకోట సంజీవరావు నాయుడు, శరగడం సత్యనారాయణ, మాదేటి అప్పారావు, యల్లపు రాజేశ్వరరావు, ఆళ్ల వెంకటేశ్వరరావు, యల్లపు కొండలరావు పాల్గొన్నారు.

శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 11 వరకు 40 రోజులకుగాను ఈ హుండీ లెక్కింపు జరిగింది. నగదు రూ.25 లక్షలా 37 వేలా 268 వచ్చింది. బంగారం 115 మిల్లీ గ్రాములు, వెండి 742 మిల్లీ గ్రాములుతో పాటు ఫారెన్ కరెన్సీ కూడా వచ్చింది. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పి.శ్రీనివాసులు రెడ్డి, గ్రేడ్ వన్ కార్య నిర్వహణ అధికారి కె.నీలిమ, సూపర్వైజింగ్ ఆఫీసర్, ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారులు వి.రాంబాబు, కె.తిరుమల్లేశ్వరరావు, ఎస్వి వరప్రసాద్, యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి - సీలేరు: చట్రాపల్లి నిర్వాసిత బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో నష్ట నివారణ చర్యలు చేపట్టి ఆర్థికంగా అన్ని విధాలా ఆదుకుంటామని పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ భరోసా ఇచ్చారు. బుధవారం జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి రహదారి సౌకర్యాన్ని బాగుచేయడంతో వాహనాల్లోనే అక్కడికి చేరుకున్న పిఒ, అక్కడ భీతావహ దృశ్యాలను చూసి నిర్ఘాంతపోయారు. చట్రాపల్లి గ్రామంలో 32 కుటుంబాలకు జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి నివేదికను వెంటనే పంపించాలని ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు తహశీల్దార్ కుమారస్వామి, ఇతర అధికారులను ఆదేశించారు. గ్రామంలో పంట నష్టాలపై నివేదించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు చేరుకొని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. గాలికొండ పంచాయతీ పరిధిలో రహదారులు, కల్వర్టులు వంతెనలు విద్యుత్తు సంబంధించి ఎంత నష్టం జరిగిందో సచివాలయ ఇంజనీరింగ్ అధికారులు గిరిజన సంక్షేమ, ఎపి ట్రాన్స్కో ధికారులు పరిశీలన చేసి నివేదిక పంపాలని ఆదేశించారు.. మండలంలో వివిధ పంచాయతీ పరిధి గ్రామాల్లో విద్యుత్ రహదారులు సౌకర్యం మంచినీరు సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అదికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పివో అభిషేక్ ఆదేశించారు.

సప్పర్ల ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న పిఒ అభిషేక్

బాధిత కుటుంబాలు, క్షతగాత్రులను పరామర్శ

సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న చట్రాపల్లి బాధిత కుటుంబాలను ఐటిడిఎ పిఒ అభిషేక్ పరామర్శించారు. సంఘటన తీరును బాధిత కుటుంబాలును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించారు.. సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో వసతి భోజనన సౌకర్యాలపై ఆరా తీశారు. బాధితులకు ఎటువంటి సమస్య లేకుండా చూడాలని హెచ్ఎం నాగేశ్వరరావును ఆదేశించారు. అనంతరంసప్పర్ల పిహెచ్సిలో వైద్య సేవలు పొందుతున్న క్షతగాత్రులను పీవో అభిషేక్ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇఒపిఆర్డి పాపారావు, సీలేరు జికే వీధి ఎస్ఐలు జె.రామకృష్ణ, అప్పలసూరి ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

చట్రాపల్లి బాధితులకు దుస్తులు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: చట్రాపల్లి బాధిత కుటుంబాలకు పోలీసులు చేయూతనిస్తూ, రగ్గులు చీరలు టీ షర్టు లుంగీలు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి 32 కుటుంబాలు ఇళ్లు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఒకరు మృత్యువాత పడగా, పలువురికి గాయాలయ్యాయి. బాధితులు సర్వం కోల్పోయి పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో బాధితులను ఆదుకునేందకు పోలీస్ శాఖ ముందుకు వచ్చింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీలేరు ఎస్సై జె. రామకృష్ణ, జికె.వీధి ఎస్ఐ అప్పలసూరి సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో ఉన్న బాధిత కుటుంబాలకు బట్టలు పంపిణీ చేపట్టారు. ముందుగా బాధిత కుటుంబాలతో ప్రత్యేకంగా సమావేశమై సంఘటన జరిగిన తీరును, నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎవరు అధైర్య పడవద్దని, ధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకి తెలియజేసి పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రెండు రగ్గులు రెండు టీ షర్టు రెండు చీరలు రెండు లుంగీలు చొప్పున అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న చట్రాపల్లి బాధిత కుటుంబాలను గాలికొండ ఎంపిటిసి అంపరంగ బుజ్జిబాబు పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనంతరం పోలీసులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు.

బాధితులకు నిత్యవసరాలు, ఆర్థికసాయం

చట్రాపల్లి బాధిత కుటుంబాలకు రూ.పదివేలు చొప్పున రూ.50 వేల ఆర్థిక సాయం, బియ్యం, ఉప్పు, పప్పు, పంచదార, టీ పొడి ఆయిల్ పసుపు కారం, బిస్కెట్లు తదితర నిత్యవసర సరుకులను ఆదివాసీ ట్రస్ట్ చైర్మన్ బి కే పడాల్ అందజేశారు. జరిగిన సంఘటన తీరను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సప్పర్ల పిహెచ్సిలో వైద్య సేవలు పొందుతున్న బాధితులకు పరామర్శించారు.

బొజ్జియ్యను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిజిటి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తీగల బొజ్జియ్య సేవలు అభినందనీయమని స్థానిక ఎంఇఒ కె సత్యనారాయణ దొర, సర్పంచ్ జి రమణి, లబ్బర్తి ఎంపిటిసి జి పెద్దిరాజు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డివిజనల్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ సేవా పురస్కారం అందుకున్న నేపథ్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గోపాలకృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మరిచర్ల శీను ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,పాఠశాల యాజమాన్య కమిటి సభ్యులు అభినందన సభ నిర్వహించి, ఘనంగా సత్కరించారు. సర్పంచ్ జి రమణి, ఎంపీటీసీ జి పెద్దిరాజు,ఎంఈఓ కెవివి సత్యనారాయణ దొర, పిఎంసి కమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ మాట్లాడతుఊ, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు తమ పాఠశాలలో పనిచేయడం చాలా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ 2 సూరారెడ్డి, పిఎంసి కమిటీ వైస్చైర్మన్ ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వై.రామవరం : ఈనెల 5న అదృశ్యమైన మండలంలోని దేవరమడుగు గ్రామానికి చెందిన లోత సూరిరెడ్డి. గ్రామపొలిమేరలోని పొదల్లో శవమై కనిపించాడని గ్రామస్తులు తెలిపారు. కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసిన తర్వాత ఇంటినుంచి బయటకు వెళ్లిన సూరిరెడ్డి తర్వాత కనిపించలేదని, దీంతో అతని భార్య వెంకటలక్ష్మి. ఈనెల 6న వై రామవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులతోపాటు కుటుంబ సభ్యులు సూరిరెడ్డి ఆచూకీ కోసం గాలించగా, మంగళవారం రాత్రి శవమై కనిపించాడు. మృతదేహం బాగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అడ్డతీగల సిఐ నరసింహమూర్తి, వై రామవరం ఎస్ఐ సంతోష్ కుమార్. సంఘటన స్థలానికి. చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాగా పాడవ్వడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘటనాస్థలంలోనే డాక్టర్ రాహుల్ పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్కుమార్ తెలిపారు.

విద్యుత్షాక్తో మహిళకు గాయాలు

ప్రజాశక్తి- వై.రామవరం : మండలంలో పి ఎర్రగొండ గ్రామంలో విద్యుత్షాక్తో మహిళ తీవ్రగాయాల పాలైంది. గ్రామానికి చెందిన మఠం అచ్చియ్యమ్మ ఉతికిన బట్టలను మేడపై ఆరబెట్టేందుకు వెళ్లగా, పక్కనే ఉన్న విద్యుత్ లైన్కు చీర తగలడంతో షాక్కు గురై తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి. తరలించగా, డాక్టర్ రాహుల్ పరీక్షించి, ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ఎటపాక : ఎటపాక గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మారెళ్ల నరసింహరావు (47)విద్యుత్ షాక్తో మరణించాడు. ఎటపాక గ్రామంలో ఒక భవన నిర్మాణ పనికి వెళ్లిన నరసింహరావు సెంటరింగ్ పనులు చేస్తుండగా అదే ఇంటి పై నుండి వెళ్తున్న 11 కెవి. విద్యుత్ లైన్కు నరసింహరావు పట్టుకున్న సెంట్రింగ్ కర్ర తగలడం తో విద్యుత్ షాక్తో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న నరసింహారావును తోటి కార్మికులు, స్థానికులు భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. అయితే నరసింహరావు అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిర్వహించి భౌతిక కాయన్ని ఇంటికి తరలించారు. నరసింహరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.